నమస్తే తెలంగాణ
# కరీంనగర్
8 | కరీంనగర్, గురువారం 3 ఏప్రిల్ 2025 | KARIMNAGAR



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీగా వెళ్తున్న నేతన్నలు, కార్మిక సంఘం నాయకులు

# కూలీ రేట్ల కోసం కదం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : కూలీ రేట్ల కోసం నేతన్నలు కదం తొక్కుతున్నారు. కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతున్నారు. నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకోగా, సాంచాలను యథావిధిగా బంద్ పెట్టారు. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ తీశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి ఏవోకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు మూషం రమేశ్, కోడం రమణలు మాట్లాడుతూ, ప్రభుత్వం, జౌళీశాఖ అధికారులు నేతన్నల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. కార్మికుల ఆత్మహత్యల నేపథ్యంలో మెరుగైన ఉపాధి చూపుతామని, వేతనాలు కల్పిస్తామని చెప్పిన మాటలు అమల్లోకి రావడం లేదని ధ్వజమెత్తారు. చీరల ఉత్పత్తి ప్రారంభించినప్పటికి, కార్మికులు, వార్పిన్ కార్మికుల కూలీ రేట్లు నిర్ణయించ లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండు రమేశ్, ఉడుత రవి, చంద్రకాంత్, సదానందం, తిరుపతి, వేణు, పోచమల్లు కార్మికులు పాల్గొన్నారు.

# ఆగ్రహ జ్వాల

హెచ్‌సీయూ భూములను కాపాడాలని నిరసనలు



నాయకులు, విద్యార్థులకు సంకెళ్లు వేసి లాక్కెళ్తూ విన్నూతంగా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా/ తెలంగాణ చౌక్, ఏప్రిల్ 2: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సర్కారు కొనసాగిస్తున్న దమనకాండపై వివిధ సంఘాల నాయకులు భగ్గుమంటున్ననారు. బుధవారం ఉమ్మడి జిల్లాలో నిరసనలు తెలిపారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసుల వేషధారణ వేసుకొని, సీపీఎం, ఎఫ్ఎస్ఐ కార్యకర్తలకు సంకెళ్లువేసి లాక్కెళ్లి వినూత్నంగా నిరసన తెలిపారు. సదాశివపల్లి లో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ పలు నినాదాలతో కూడిన ప్లకార్డు లు పట్టుకొని నిరసన తెలిపారు. అలాగే ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో తరగతులు బహిష్కరించి, బంద్ నిర్వహించా రు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రా కేశ్ మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను వేలం వేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యార్థుల హక్కులను కాల రాసే విధంగా జారీ చేసిన జీవోలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.



తరగతులు బహిష్కరించి బయటకు వస్తున్న యూనివర్సిటీ విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

# ఇది హింసించే పాలన

- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, ఏప్రిల్ 2 : కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, ఇది ప్రజలు, మూగజీవాలను హింసించే పాలన అని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. పదహారు నెలల రేవంత్ రెడ్డి పాలనలో విధ్వంసంతప్ప అభివృద్ధిలేదని మండిపడ్డారు. హెచ్ సీ యూ విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని ఖండించారు. ఈమేరకు బుధవా రం ఒక ప్రకటన విడుదల చేశారు. పచ్చని అడవిని నాశనం చేయద్దని నిరసనకు దిగిన హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రకృతిని, వన్యప్రాణులను సంరక్షించుకు నే బాధ్యత మనందరిపైనే ఉందని చెప్పారు. హైదరాబాద్‌కు ప్రాణవాయువు అయినటువంటి 400ఎకరాల భూమిని అమ్మి పార్టీ అధిష్టానానికి కప్పం కట్టేందుకు రేవంత్ సర్కారు చూస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వ నీచమైన ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రజానీకం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని చేతి లో పట్టుకొని పెద్దపెద్ద మాటలు మాట్లాడుతూ దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీకి హెచ్‌సీయూలో బుల్డోజర్లతో చేస్తున్న విధ్వంసం కనపడడం లేదా అని ప్రశ్నించారు.



బెస్తపల్లిలో వేటకు వెళ్లకుండా ఇంటి వద్ద పెట్టిన తెప్పలు, వలలతో మత్స్యకారులు



నీళ్లు లేక ఎండిపోయిన సుందిళ్ల బరాజ్



# గోదావరి ఎడారి.. బతుకులు తడారి

ఆగమైన మత్స్యకారుల జీవితాలు

- కాంగ్రెస్ సర్కారు పాపం.. చేపల వృత్తిదారులకు శాపం
- బరాజ్‌ల్లోని నీటిని నిల్వ చేయకపోవడంతో ఉపాధికి గండి
- స్వరాష్ట్రంలో పుష్కలమైన జలరాశితో చేతినిండా పని
- ఒక్కో మత్స్యకారుడికి రోజుకు రూ.వెయ్యికిపైగా ఆదాయం
- ఏడాదిన్నరగా నదిలో నీరు లేక కుటుంబాలు ఆగం
- తెప్ప, తెడ్డు వదిలి ఇతర పనుల్లోకి పయనం

**గోదారి తీర ప్రాంత మత్స్యకారుల జీవితం ఆగమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పాపం వారికి శాపంగా మారింది. ఏడాదిన్నర కిందటి వరకు పుష్కలమైన జలాలతో కళకళలాడిన గోదావరిని ఎండబెట్టడంతో చేపల వృత్తిదారుల బతుకు ఎడారిగా మారింది. బరాజ్‌ల గేట్లు బార్లా తెరిచి నీటిని దిగువకు వదలడంతో ఉపాధికి గండి పడింది. నాడు దండిగా వృద్ధి చెందిన తీరొక్క చేపలు, రొయ్యలు పట్టుకుంటూ, రోజుకు రూ.వెయ్యికిపైనే సంపాదించిన మత్స్యకారులు ప్రస్తుతం పనిలేక ఆగమవుతున్నారు. కుటుంబపోషణ కోసం కూలీకి వెళ్తున్నారు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని దాదాపు 2500 మంది తెప్ప, తెడ్డు వదిలి ఇతర పనుల్లోకి వెళ్లి బతుకీడుస్తున్నారు.**

పెద్దపల్లి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. మన భూములు బీడు వారుతున్నా నీళ్లను మళ్లించాలన్న ఆలోచన చేయలేదు. కానీ, స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలు నిర్మించి గోదావరిని నిండుకుండలా మార్చారు. ఎగువకు నీళ్లను ఎత్తిపోసి భూములను సస్యశ్యామలం చేశారు. ఇదే సమయంలో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంచారు. మూడు బరాజ్‌ల్లో పుష్కలంగా నీరు ఉండడంతో చేపల పెంపకాన్ని చేపట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలు పోసింది. ఎల్లంపల్లిలో 12.21లక్షల చేప పిల్లలు, సుందిళ్ల బరాజ్‌లో 11.41లక్షలు, అన్నారం బరాజ్‌లో 8.93లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తూ వచ్చింది. సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి బరాజ్‌లలో 19లక్షల రొయ్యపిల్లలను పోస్తూ రాగా, గోదావరి తీరం వెంట ఉన్న పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని దాదాపు వేలాది మంది మత్స్యకారుల ఉపాధికి ఢోకా లేకుండా పోయింది. 2019లో ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి చేతినిండా పనితో రందిలేకుండా బతికారు. ఒక్కో మత్స్యకారుడు ఆడుతూ పాడుతూ పనిచేస్తూ రోజూ రూ.వెయ్యికి పైగానే సంపాదించారు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయకక్షతో ప్రాజెక్టును ఎండ బెట్టి మత్స్యకారుల నోట్లో మట్టికొట్టింది. బ్యారేజీలు బార్లా తెరిచి చుక్కనీటిని నిల్వ చేయకపోవడంతో గోదారి ఎడారిగా మారింది. ఉపాధి లేక ఏడాదిన్నరగా మత్స్యకారుల బతుకు దుర్భరంగా మారింది.



నీళ్లు లేక ఎండిపోయిన గోదావరిఖని గోదావరి తీరం



చేపల వేట లేక బోసిపోయిన మత్స్యకారుల గ్రామం బెస్తపల్లి

## 2500 కుటుంబాలు ఆగం

పెద్దపల్లి, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో విస్తరించి ఉన్న గోదావరిపై ఆధారపడే 2500 మంది మత్స్యకారులు బతుకుతున్నారు. అందులో 1500 మంది కేవలం చేపల వేట వృత్తిపైనే ఆధారపడి ఉండగా, మరికొంత మంది వ్యవసాయం, ఇతర పనులను చేసుకుంటూనే వృత్తిని కొనసాగిస్తున్నారు. ఏడాదిన్నరగా బరాజ్‌లలో ప్రభుత్వం నీటిని నిల్వ చేయకపోవడంతో మత్స్యకారులకు పనిలేకుండా పోయింది. పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం ఆరెంద, ఖాన్‌సాయిపేట, ఖానాపూర్, మంథని, విలోచవరం, పోతారం, నాగారం, గుంజపడుగు, సిరిపురం, బెస్తపల్లి, రామగిరి మండలం జల్లారం, పెద్దంపేట, సుందిళ్ల, రామగుండం మండలం జనగామ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, అంతర్గాం మండలం ఎల్లంపల్లి, కుక్కల గూడూరు, ముర్మూరు గ్రామాల్లోని వందలాది మంది మత్స్యకారులు ఆగమయ్యారు. కుటుంబాలు ఉపాధి దొరక్క కొత్త కొత్త పనుల్లోకి వెళ్తూ బతుకీడిస్తున్నారు.

## మళ్లీ వలసలు

తెలంగాణ రాక ముందు ఉపాధి కోసం వలసబాట పట్టిన మత్స్యకారులు కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత స్వగ్రామాలకు తిరిగొచ్చారు. బ్యారేజీల నిర్మాణంతో గోదావరి నిండుగా మారగా, చేపల వేట చేస్తూ ఆనందంగా జీవించారు. వలలు, తెప్పలు, బోట్లు కొనుక్కొని నాలుగేళ్లపాటు చేపల వేటే ప్రధాన వృత్తిగా ఎంచుకొని జీవించారు. ఉన్న ఊరిలోనే సంతోషంగా గడిపారు. కానీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షతో కాంగ్రెస్ సర్కారు కాళేశ్వరం నీళ్లను కిందకు వదలడంతో గోదావరి ఎడారిలా మారింది. ఉపాధి దెబ్బతిని మత్స్యకారుల తినే అన్నంలో మన్నుపోసినట్టయింది. దీంతో మళ్లీ వలసబాట పడతున్నారు. మంథని మండలంలోని బెస్తపల్లిలో మొత్తంగా 300 మత్స్యకార కుటుంబాలు ఉంటే, అందులో 60 కుటుంబాల నుంచి వలసబాట పట్టారు. ఇప్పటికే కొందరు భార్యాపిల్లలను వదిలి వెళ్తే మరికొందరు కుటుంబాలతో కలిసి వెళ్లారు. మరికొంత మంది కూడా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

## సెంట్రింగ్ పని చేసుకుంటున్న

మా ఊళ్లో 300 బెస్త కుటుంబాలు ఉన్నయి. తొమ్మిదేండ్లు ఎంతో ఆనందంగా ఉన్నం. గోదారి నిండిన తర్వాత వలస వెళ్లినోళ్లు తిరిగి వచ్చి చేపలు పట్టుకొని సంతోషంగా బతికిన్రు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి గోదావరిని ఎండబెట్టి మా నోట్లో మట్టికొట్టింది. పచ్చగా ఉన్న మా ఊరు ఆగమైంది. మళ్లీ 70 కుటుంబాలు వలసపోవాల్సిన పరిస్థితి వచ్చింది. నా భార్య మొన్నటిదాకా సర్పంచ్‌గా ఉంది. చేసిన పనిని బిల్లులు రాక అప్పులు పెరిగినయి. ఇటు గోదారిలో నీళ్లు లేక చేపల పట్టే పని లేక చుట్టు పక్కల గ్రామాల్లో నేను సెంట్రింగ్ పని చేసుకుంటూ అప్పులు కడుతున్న.

**- తోకల నర్సయ్య, బెస్తపల్లి**



## చేపల వేట వదిలి వ్యవసాయం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు తాడబోయిన అర్జున్. ఊరు మంథని మండలం ఆరెంద. ఎంకాం దాకా చదివాడు. మంథనిలో ఇల్లు కట్టుకున్నాడు. అక్కడ ఏదైనా వ్యాపారం చేసుకొని స్థిరపడాలనుకున్నాడు. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడం, అన్నారం బ్యారేజీ బ్యాక్ వాటర్ ఏరియాలోనే ఆరెంద ఉండడం, నీళ్లు రావడంతో వెంటనే చేపల వేటలోకి దిగాడు. పెద్ద ఎత్తున వలలు, ఓడలు కొని చేపలు పట్టడం మొదలుపెట్టాడు. రోజు ₹వెయ్యి నుంచి ₹3వేల సంపాదించుకున్నాడు. నాలుగేళ్లపాటు ఏ రంది లేకుండా బతికాడు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నారం బ్యారేజీ నుంచి నీళ్లను వదిలివేయడంతో గోదావరి ఎడారిలా మారింది. ఉపాధి దెబ్బతిన్నది. ఏం చేయాలో తెలియక ఎవుసంబాట పట్టాడు. అర్జున్ ఒక్కడే కాదు, ఆ గ్రామంలో ఉన్న 30 మంది మత్స్యకారుల జీవితాలు చీకట్లోకి వెళ్లాయి. ఆశతో కొనుగోలు చేసిన వలలు, ఓడలు అన్నీ మూలకు పడేసి ఉపాధి వేటలో పడ్డారు. కొందరు సుతారి కింద కూలీగా, మరి కొంత మంది ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ బతుకుతున్నారు. ఇంకొందరు వలసబాట పట్టారు.

## ఎక్కడ పని దొరికితే అక్కడికి పోతున్నం



గోదావరి గొప్పగా ఉన్నప్పుడు రోజుకు రూ.వెయ్యి పైనే సంపాదించుకున్నం. కానీ ఇప్పుడు గోదారి ఎండ బెట్టడంతో బతుకులు ఆగమైనయి. మాకు తెలిసింది చేపలు పట్టడం మాత్ర మే. ఉపాధి పోవడంతో మా జీవితాలు చీకటి అయినయి. ఎక్కడ పని దొరికితే అక్కడికి పోతున్నం. కైకిళ్లు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నం. మళ్లీ గోదారి నిండు కుండలా ఉంటేనే మేం బాగుపడుతం. ప్రభుత్వం గోదారిని నింపి అందరినీ ఆదుకోవాలి.

**-మేడి లక్ష్మణ్, మత్స్యకారుడు, బెస్తపల్లి (మంథని మండలం)**

## ప్రత్యామ్నాయం చూపాలి



మా పోతారం గ్రామంలో 36 కుటుంబాలు చేపలు పట్టే బతుకుతయి. గోదారిలో నీళ్లు లేకపోవడంతో మా జీవనాధారం పోయినట్టయింది. నిండుగ ఉన్నప్పుడు రోజూ చేపలు పట్టి పైసలు సంపాదించుకున్నం. కానీ, ఇప్పుడు వలలు, తెప్పలు, బోటు తీయక మూలకు పెట్టినం. ఉపాధి లేక మస్తు ఇబ్బంది అయితంది. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి. మమ్మల్ని ఆదుకోవాలి.

**- బోగిరి భాస్కర్, పోతారం (మంథని మండలం)**


## మా నోట్లో మట్టి కొట్టిన్రు



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక కావాలనే గోదారిని ఎండబెట్టి మా నోట్లో మట్టి కొట్టిన్రు. గుంజపడుగుల దాదాపుగా 500 కుటుంబాలు చేపల పట్టే బతుకుతయి. ఇంత మంది బతుకులను నాశనం చేసింది. నీళ్లు లేక రైతుల పంటలు కూడా ఎండుతున్నయ్. గోదారిలో నీళ్లు ఉంటే ఎంతో మందికి ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వం ఆలోచించి నీటిని నింపాలి.

**- ఊదరి బానయ్య, గుంజపడుగు**

## ఉపాధి పోయింది



గోదారి ఎండడంతో మా ఉపాధి పోయింది. చేపలు పట్టుడు లేక చిన్న చిన్న లేబర్ పనులకు వెళ్తున్న. మా ఊళ్లో 22 కుటుంబాలు ఉన్నయి. గోదారి ఎండడంతో ఇక్కడే ప్రభుత్వం ఇసుక రీచ్ పెట్టింది. దీంట్లో రోజు ట్రాక్టర్లల ఇసుక నింపి కుటుంబాలను పోషించుకుంటున్నం. గోదారిలో నీళ్లు వస్తేనే మాకు మంచి ఉపాధి ఉంటది.

**- గంగపుత్ర సంపత్, విలోచవరం**

# రెవెన్యూ క్లబ్‌లో స్వాహా బాగోతం!

- నెలనెలా లక్షల్లో రెంట్ వసూళ్లు
- నికర ఆదాయం మాత్రం జీరో
- ఆ డబ్బులు ఎటుపోయినట్టు?
- దశాబ్దాలు గడిచినా పైసా ఆస్తి పన్ను చెల్లించని ఘనత
- మున్సిపల్ అధికారుల సీజ్‌తో వెలుగులోకి నిర్వాకం



సీజ్ చేసిన రెవెన్యూ క్లబ్ అద్దె గదులు

**కరీంనగర్ నడిబొడ్డున ఉన్న రెవెన్యూ క్లబ్ నిర్వహణ గాడి తప్పింది. నెలనెలా లక్షల్లో రెంట్ వస్తున్నా దశాబ్దాలు గడిచినా పైసా ఆస్తి పన్ను చెల్లించకపోవడం అందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఒకటికాదు రెండు కాదు ₹80లక్షలు బకాయి ఉందని పేర్కొంటూ రెండ్రోజుల కింద క్లబ్ ఆధీనంలోని దుకాణాల సముదాయాలను నగరపాలక సంస్థ సీజ్ చేయగా, ఇన్నేండ్ల నుంచి వచ్చిన ఆదాయం ఏమైందనే ప్రశ్న తలెత్తుతున్నది. స్వాహా జరిగిందనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. కార్యవర్గం ఎప్పటికప్పుడు మారుతున్నా వచ్చే ఆదాయ, వ్యయాలపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో నెలనెలా వచ్చే సొమ్మును హాంఫట్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.**

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 2: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ క్లబ్ ఆధీనంలోని దుకాణాల సముదాయం సీజింగ్ వ్యవహారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. క్లబ్ ఆధీనంలోని దుకాణాల సముదాయంలో 30కి పైగా గదులు, వీటి పైన 2వేల చదరపు ఫీట్ల విస్తీర్ణానికి పైగా మరో భవనం, రెవెన్యూ గార్డెన్, మరికొంత ఖాళీ స్థలం ఉన్నది. వీటిని రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభించి, వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇస్తుండగా, నాటి నుంచి నేటి వరకు నయాపైసా కూడా మున్సిపాలిటీకి ఆస్తి పన్ను రూపేణా చెల్లించనట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో వీటన్నింటికీ మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించిన ప్రకారం గత నెల 31లోపైతే రిబేటుతో కలిసి ₹30,85,653 చెల్లించాలని గడువు విధించారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో సీజ్ చేసినా.. క్లబ్ ఖాతాలో డబ్బులు లేక చెల్లించలేదని క్లబ్ ప్రతినిధులు వెల్లడిస్తున్నారు. అయితే గడువు ముగిసిన తర్వాత అధికారులు మాత్రం మొత్తం ₹80,93,067 చెల్లిస్తేనే సీజ్ తొలగిస్తామని స్పష్టం చేస్తుండగా, చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా చెల్లింపులు చేసేదెలా..? అని క్లబ్ కార్యవర్గం తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో అద్దెకు ఉండి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా ఆందోళన చెందుతున్నారు.

## ఆ ఆదాయం ఎటుపోయినట్టు?

రెవెన్యూ క్లబ్ ఆధీనంలో 30కి పైగా అద్దె గదులు, రెవెన్యూ గార్డెన్ పేర ఓ ఫంక్షన్ హాల్, ఖాళీ ప్రదేశం, అద్దె గదులపైన రెండు వేల చదరపు ఫీట్లకు పైగా భవనం ఉన్నది. కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న గదులకు ₹7వేలు, రెవెన్యూ క్లబ్ వైపు గదులకు ₹6,500 చొప్పున నెలవారీ అద్దె క్లబ్‌కు వస్తున్నట్టు తెలుస్తున్నది. కేవలం గదుల ద్వారానే నెలకు ₹2.25లక్షల వరకు ఆదాయం సమకూరుతున్నది. ఒకటో అంతస్తులోని భవనం, రెవెన్యూ గార్డెన్, ఖాళీ స్థలంలో కొనసాగుతున్న సర్వీసింగ్ సెంటర్ ద్వారా వచ్చే ఆదాయం అదనం. వీటన్నింటి ద్వారా మొత్తంగా సగటున నెలకు ₹3లక్షల దాకా ఆదాయం వస్తున్నట్టు క్లబ్ సభ్యులే లెక్కలేసి చెబుతున్నారు. ఏడాదికి కనీసం ₹36 లక్షలు అవుతుంది. 20 ఏళ్ల నుంచి నేటి వరకు అన్ని ఖర్చులు పోను ₹5కోట్లకు పైగానే నికర ఆదాయముండాల్సి ఉండగా, ఆస్తి పన్ను కూడా చెల్లించని స్థితికి చేరడంపై ఆశాఖలోని కిందిస్థాయి ఉద్యోగులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. క్లబ్ కార్యవర్గం ఎప్పటికప్పుడు మారుతున్నా వచ్చే ఆదాయ, వ్యయాలపై ఏ మాత్రం దృష్టి సారించకపోవడంతో నెలనెలా వచ్చే ఆదాయాన్ని ఎవరికి వారే అన్నట్లుగా హాంఫట్ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికయ్యే కార్యవర్గం ప్రతి ఆర్థిక సంవత్సరంలో క్లబ్ లావాదేవీలపై ఆడిట్ చేయించాల్సి ఉండగా, ఎన్నడూ ఆదిశగా ఆలోచించనే లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రతి నెల క్రమం తప్పకుండా లక్షల్లో వచ్చే ఆదాయం ఎటు మళ్లిందనే అనుమానాలు సభ్యుల్లో వ్యక్తమవుతున్నాయి. రెండు దశాబ్దాలుగా ఆస్తి పన్ను చెల్లించకున్నా అధికారులు ఎందుకు మౌనం వహించారని, దీని వెనుక ఆంతర్యమేమిటని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూళ్లపై కొన్ని నెలల క్రితమే కమిషనర్‌గా వచ్చిన ఐఏఎస్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక దృష్టి సారించడంతో బకాయి ఉదంతం వెలుగులోకి వచ్చింది. ₹80లక్షలకు పైగా పెండింగ్‌లో ఉండడాన్ని ఆమె సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తున్నది. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న రెవెన్యూ క్లబ్ నిర్వహణ, క్లబ్‌కు ఉన్న ఆస్తుల ద్వారా వస్తున్న ఆదాయ, వ్యయాలపై సరైన లెక్కలు లేకపోవడంపై అన్ని వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతున్నది. దీనిపై కలెక్టర్ దృష్టి సారించి లోతుగా విచారణ జరిపిస్తే, మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని రెవెన్యూ వర్గాలే పేర్కొంటుండడం కొసమెరుపు. దీనిపై సంబంధిత బాధ్యులను వివరణ కోరగా నిరాకరించారు.

# ధాన్యం దళారులపాలు



పాపయ్యపల్లెలో కల్లం వద్ద కాంటా పెట్టి ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2: రైతులు ఈ యాసంగిలో అరిగోస పడ్డారు. వరి చేతికొచ్చిన దశలో నీళ్లు లేక అష్టకష్టాలు పడ్డారు. కొందరు పశువుల మేతకు వదిలేస్తే.. మరికొందరు పంటలు కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేశారు. ఇప్పుడు మిగిలిన పంటను అమ్ముకునేందుకు తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఎదురవుతున్నది. ఈ క్రమంలో మద్దతు ధర కంటే తక్కువగా ₹1700 నుంచి ₹1800కే క్వింటాల్‌కు అమ్ముకోవాల్సి వస్తున్నది. తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉదయాన్నే కల్లాల వద్ద కాంటాలు పెట్టి మరీ దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర కొనేలా చూడాలని వేడుకుంటున్నారు.